సాక్షి కర్నూలు

బుధవారం ; 15 ; నవంబర్ ; 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: ఆలయప్రాంగణంలో శనగల బసవన్న నందీశ్వరునికి, శ్రీశైల క్షేత్ర పాలకుడు బయలువీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా అర్చకులు పూజలు నిర్వహించారు.



వైభవంగా బలిపాడ్యమి వేడుకలు

మంత్రాలయం: రాఘవేంద్ర స్వామి మఠంలో కార్తీక మాసం బలి పాడ్యమి వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు మూలరాములకు అభిషేక పూజలు నిర్వహించారు.



కేసీకి నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు మంగళవారం 2,354 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. డ్యాంలో 1.20 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

రూ.80 కోట్లతో 30 రోడ్లకు టెండర్లు పూర్తి



ఆర్.నాగరాజు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.80 కోట్లతో 30 రోడ్ల పనులు చేపట్టనున్నట్లు ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఆర్ నాగరాజు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ముఖ్యమైన రోడ్లను అభివృద్ధి చేసేందుకు సీఎంఓ ప్రతిపాదనలు కోరిందన్నారు. రూ.45.60 కోట్ల అంచనాతో 21 మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్స్, స్టేట్ హైవేస్ కింద రూ.34.40 కోట్ల అంచనాతో 9 రోడ్లకు ప్రతిపాదనలు పంపగా, వాటిని ప్రభుత్వం ఆమోదించిందన్నారు. ఈ నేపథ్యంలోనే టెండర్లను కూడా పూర్తి చేశామన్నారు.

పనులకు అగ్రిమెంట్ పూర్తయిన రోడ్లు

- పెద్దకడుబూరు నుంచి దొడ్డిమేకల వరకు 10 కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.30 కోట్లు
- కపటి నుంచి పెద్దతుంబళం వరకు 13 కిలో మీటర్ల రోడ్డుకు రూ.2.60 కోట్లు.
- నెల్లూరు–బళ్లారి–బాంబే హైవేలో 231/2 కి.మీ నుంచి 233/1 వరకు రూ.1.20 కోట్లు
- డోన్ – రాయలచెరువు 1/6 నుంచి 2/0 కి.మీ వరకు రూ.50 లక్షలు.

విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా సహాయ పరికరాలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు సహాయ పరికరాలను ఉచితంగా అందించేందుకు చిప్పగిరి, మద్దికెర, హొళగుంద మండలాల్లో శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ సహాయ సంచాలకులు రయిస్‌ఫాతిమా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు చక్రాల సైకిల్, వీల్ చైర్, చంక కర్రలు, బ్యాటరీతో నడిచే మూడు చక్రాల సైకిల్, శ్రవణ యంత్రం, అంధుల చేతి కర్రలను, వయో వృద్ధులకు సహాయ పరికరాల అవసరాన్ని గుర్తించేందుకు ఎంపిక శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 12న చిప్పగిరి, 14న హొళగుంద, 16న మద్దికెర ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిబిరాలను నిర్వహిస్తామన్నారు. సహాయ పరికరాలకు అర్హులైన వారు 40 శాతానికి తక్కువ కాకుండా సదరం సర్టిఫికెట్, ఆధార్, రేషన్‌కార్డు, కుల, ఆదాయ (నెలకు రూ.22,500) ధృవీకరణ పత్రాలు, వికలత్వం కనపడే విధంగా మూడు ఫొటోలు, స్వావలంబన కార్డు జిరాక్స్ కాపీలను తీసుకు రావాలన్నారు.

నేడు గూడూరులో 'జగనన్నకు చెబుదాం-స్పందన'

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమాన్ని ఈ బుధవారం గూడూరులో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 నుంచి 2 గంటల వరకు ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని గూడూరు పట్టణ, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాలి

- డీఈఓ రంగారెడ్డి



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న డీఈఓ రంగారెడ్డి

ఓర్వకల్లు: విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి డా.డీవీ రంగారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఓర్వకల్లు, హుస్సేనాపురం, సోమయాజులపల్లె జెడ్పీ హైస్కూళ్లతో పాటు, కస్తూర్బాగాంధీ విద్యాలయం, స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓర్వకల్లు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జాతీయ బాలల దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో నెహ్రూ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను డీఈఓ వీక్షించి, విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఓంకార్‌యాదవ్, ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డి, డిజిటల్ నోడల్ ఆఫీసర్ ధనరాజు, హుసేనాపురంలో సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, గోపా వెంకటరమణారెడ్డి, జీకే వెంగన్న, హెడ్ కానిస్టేబుల్ రాముడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



స్కిల్ హబ్‌లో శిక్షణ పొందుతున్న యువతీ యువకులు

యువత భవితకు 'నైపుణ్య' బాట



స్కిల్ కాలేజీలో నైపుణ్యాన్ని పెంచుకుంటున్న విద్యార్థులు

- నియోజకవర్గాల వారీగా స్కిల్ హబ్‌ల ఏర్పాటు
- ప్రతి హబ్‌లో ఏడాది పొడవునా శిక్షణ
- డీఆర్‌డీఏ-వైకేపీ ఆధ్వర్యంలో నడుస్తున్న స్కిల్ కాలేజీ
- విస్తృతంగా మెగా, మినీ జాబ్‌మేళాల నిర్వహణ
- ఈ ఏడాది ఇప్పటి వరకు 1,773 మందికి ఉద్యోగాలు

యువతలో నైపుణ్యాలను వెలికితీసి వారి భవిష్యత్తుకు రాష్ట్ర ప్రభుత్వం బంగారు బాటలు వేస్తోంది. ఇందుకోసం నియోజకవర్గాల వారీగా స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేసింది. వీటిలో శిక్షణ తీసుకున్న యువతీ యువకులు వివిధ కంపెనీల్లో మంచి వేతనంతో ఉద్యోగాలు సాధించారు. జీవితంలో నిలదొక్కుకున్నారు. కుటుంబానికి అండగా ఉంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన మేలు తాము మరువబోమని వారు చెబుతున్నారు.

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగం సాధించడం.. మంచి వేతనం తీసుకుంటూ సమాజంలో ఉన్నతంగా బతకడం ..ప్రతి యువకుడి కల. ఈ కలను రాష్ట్ర ప్రభుత్వం సాకారం చేస్తోంది. స్కిల్ హబ్‌లు, స్కిల్ కాలేజీల్లో శిక్షణ ఇస్తూ.. తరచుగా ఉద్యోగ మేళాలు నిర్వహిస్తోంది. టీడీపీ హయాంలో కాగితాల మీద మినహా యువత నైపుణ్యాభివృద్ధికి తీసుకున్న చర్యలు లేవు. శిక్షణల పేరుతో నాటి పాలకులు నిధులు కొల్లగొట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్, డీఆర్‌డీఏ-వైకేపీ ద్వారా యువతలో నైపుణ్యాలను అభివృద్ధి చేస్తోంది. ప్రభుత్వం తీసుకుంటున్న చొరవ కారణంగా 2022–23లో 2,726 మందికి, 2023–24లో ఇప్పటి వరకు 1,773 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చాయి.

జిల్లాలో 8 స్కిల్ హబ్‌లు

జిల్లాలో ఎనిమిది స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేశారు. వీటిలో తక్కువ విద్యార్హతలు ఉన్నవారితోపాటు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాని వారు సైతం శిక్షణ పొందవచ్చు. జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ప్లంబర్ జనరల్.. తదితర కోర్సుల్లో యువతకు శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో హబ్‌లో ఏడాదికి నాలుగు బ్యాచ్‌ల చొప్పున శిక్షణ ఇచ్చి,ఉపాధి అవకాశాలు కలిప్తున్నారు. ప్రతి బ్యాచ్‌లో 30 మంది ప్రకారం 120 మంది శిక్షణ పొందుతున్నారు. ఒక్కో హబ్‌లో రెండు రకాలుగా కనిష్ఠంగా 45 రోజులు, గరిష్ఠంగా 3 నెలల పాటు శిక్షణ ఇస్తారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు దేశ వ్యాప్తంగా వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు.

ఏడాదికి 240 మందికి శిక్షణ

డీఆర్‌డీఏ–వైకేపీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా స్కిల్ కాలేజీ నడుస్తోంది. కర్నూలు శివారులోని టీటీడీసీలో రెసిడెన్షియల్ స్కిల్ కాలేజీ నిర్వహిస్తున్నారు. ఎమ్మిగనూరులో స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. స్కిల్ కాలేజీ, స్కిల్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా 2019–20 నుంచి 2023–24 వరకు 2,786 మందికి శిక్షణ ఇచ్చారు. ఇందులో 2,109 మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. స్కిల్ కాలేజీలో ఏడాదికి నాలుగు బ్యాచ్‌ల చొప్పున 240 మందికి శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం మెడికల్‌కు సంబంధించి పేషెంట్ రిలేషన్ సర్వీస్ డ్యూటీ మేనేజర్, పేషెంట్ రిలేషన్ సర్వీస్ అసోసియేట్, సేల్స్ సూపర్‌వైజర్‌గా రాణించేందుకు వీలుగా శిక్షణ ఇస్తున్నారు.

స్కిల్ అభివృద్ధి కమిటీ ఏర్పాటు

జిల్లా స్థాయిలో స్కిల్ అభివృద్ధి కమిటీ కూడా ఏర్పాటైంది. స్కిల్ హబ్‌ల నిర్వహణ, నైపుణ్యాల అభివృద్ధిపై ఇచ్చే శిక్షణ కార్యక్రమాలను ఈ కమిటీ సభ్యులు పర్యవేక్షించనున్నారు. కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ కన్వీనర్‌గా ఉన్నారు. కమిటీలో జిల్లా ఉపాధి కల్పన సంస్థ, న్యాక్ అధికారులు, పాలిటెక్నిక్, ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాళ్లు సభ్యులుగా ఉంటారు. స్కిల్ హబ్‌ల పనితీరును కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు.

ఉద్యమ తరహాలో జాబ్‌మేళాలు

జాబ్ మేళాలు నిర్వహిస్తూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇప్పటి వరకు నియోజకవర్గాల వారీగా మెగా జాబ్‌మేళాలు నిర్వహించారు. వీటికి 9,153 మంది హాజరు కాగా.. 3,173 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చాయి. నియోజకవర్గాల వారీగా నిర్వహించిన 37మినీ జాబ్ మేళాలకు 1,255 మంది హాజరు కాగా 327 మందికి ఉద్యోగాలు లభించాయి. ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు ఉద్యమ తరహాలో రాష్ట్ర ప్రభుత్వం జాబ్ మేళాలను నిర్వహిస్తోంది.

జిల్లాలో స్కిల్ హబ్‌లు ఇవే..

నియోజకవర్గం	శిక్షణ ఇచ్చే కేంద్రం
కర్నూలు	సిల్వర్ జూబ్లీ కాలేజీ
మంత్రాలయం	ఎస్ఎంఎల్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ, మురవణి, పెద్దకడబూరు
ఆదోని	నాక్ సెంటర్
పాణ్యం	నాక్ సెంటర్, కర్నూలు
ఆలూరు	గవర్నమెంట్ జూనియర్ కాలేజీ, ఆలూరు
కోడుమూరు	గవర్నమెంట్ జూనియర్ కాలేజీ, కోడుమూరు
పత్తికొండ	గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ, పత్తికొండ
ఎమ్మిగనూరు	గవర్నమెంట్ జూనియర్ కాలేజీ, ఎమ్మిగనూరు

ప్రభుత్వం ఎంతో మేలు చేస్తోంది



డిగ్రీ పూర్తయిన తర్వాత ఆలూరు స్కిల్ హబ్‌లో మూడు నెలలు శిక్షణ తీసుకున్నా. నైపుణ్యాలు మెరుగుపడటంతో టెక్ మహీంద్ర కంపెనీలో ఉద్యోగం వచ్చింది. 2022 ఏప్రిల్ 24 నుంచి చెన్నైలో పనిచేస్తున్నా. మంచి వేతనం లభిస్తోంది. సంతోషంగా ఉద్యోగం చేస్తున్నా. రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి యువతకు ఎంతో మేలు చేస్తోంది.

– డి.సాయికృష్ణ, ఆలూరు

మంచి వేతనం వస్తోంది



డిగ్రీ పూర్తయిన వెంటనే కర్నూలు స్కిల్ హబ్‌లో శిక్షణ తీసుకున్నా. శిక్షణ పూర్తి అయిన వెంటనే నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులే ఐసీఐసీఐ బ్యాంకులో ఉద్యోగ అవకాశం కల్పించారు. 2022 మార్చి 22న కదిరి బ్రాంచ్‌లో చేరా. మంచి వేతనం వస్తోంది. ఉద్యోగం సంతృప్తికరంగా ఉంది.

– బి.రామలక్ష్మి, లక్ష్మీపురం, కల్లూరు మండలం

నైపుణ్యాలను వెలికితీస్తున్నాం



యువతలో ఎన్నో నైపుణ్యాలు దాగి ఉంటాయి. శిక్షణలో వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో నైపుణ్యాలను వెలికి తీస్తున్నాం. ఏడాది పొడవునా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. యువతకు తగిన శిక్షణ ఇచ్చి పెద్ద కంపెనీలు, కార్పొరేట్ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లా స్థాయిలో స్కిల్ అభివృద్ధి కమిటీ కూడా ఏర్పాటైంది.

– సలీమ్‌బాషా, డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్

సహకార వ్యవస్థ ప్రాధాన్యతను పెంచుదాం



సహకార సమృద్ధి డిపాజిట్ స్కీమ్‌ను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి



డీసీఎంఎస్‌లో సహకార వారోత్సవాల పోస్టర్లను విడుదల చేస్తున్న చైర్‌పర్సన్ సీహెచ్ శిరోమణి

- సహకార రంగంపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- సహకార వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో డీసీసీబీ చైర్‌పర్సన్

కర్నూలు(అగ్రికల్చర్): సహకార వ్యవస్థ ప్రాధాన్యతను మరింత పెంచుదామని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి అన్నారు. మంగళవారం ఉమ్మడి కర్నూలు డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఆమె సహకార పతాకాన్ని ఆవిష్కరించి 70వ అఖిల భారత సహకార వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర సహకార యూనియన్ ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. భారత దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా... సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో సహకార సంఘాల పాత్ర అనే థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ వారోత్సవాల ద్వారా సహకార రంగంపై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తర్వాత సహకార సమృద్ధి డిపాజిట్ స్కీమ్‌ను ప్రారంభించి ఈ నెల 14 నుంచి వచ్చే నెల 13 వరకు మాత్రమే ఈ స్కీమ్ అమలులో ఉంటుందని తెలిపారు. అత్యధిక వడ్డీరేటుతో డిపాజిట్ స్కీమ్‌ను అమలు చేస్తున్నామని, ఈ అవకాశాన్ని ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 456 రోజుల కాలపరిమితితో చేసే డిపాజిట్‌లకు సీనియర్ సిటిజన్‌కు 8.20 శాతం, ఇతరులకు 7.70 శాతం వడ్డీ ఇస్తున్నట్లు తెలిపారు. డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.రామాంజనేయులు మాట్లాడుతూ... సహకార వారోత్సవాలకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. అంతకు ముందు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని చైర్‌పర్సన్ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు గుండం సూర్యప్రకాశ్‌రెడ్డి, కె.వెంకటరమణారెడ్డి, మూలింటి రాఘవేంద్ర, సీమ సుధాకర్‌రెడ్డి, డీసీఓ ఎస్.రామాంజనేయులు, ఆప్కాబ్ నోడల్ అధికారి దినేష్‌కుమార్, ఐసీడీపీ సీఈఓ వెంకటకృష్ణ, డీఆర్ ఓఎస్‌డీ నాగలింగేశ్వరి, ఆప్కాబ్ డీజీఎం విజయకుమార్, డీపీడీఎం నహిదసుల్తాన, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్‌కుమార్, నాగిరెడ్డి, ఏజీఎం త్రినాథరెడ్డి పాల్గొన్నారు.

డీసీఎంఎస్‌లో...

జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలో కూడా సహకార వారోత్సవాలు నిర్వహించారు. సహకార పతాకాన్ని, వారోత్సవాలకు సంబధించిన పోస్టర్లను డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సీహెచ్ శిరోమణి మద్దయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దేశ ఆర్థికాభివృద్ధిలో సహకార వ్యవస్థ భాగస్వామ్యం ఎంతో ఉందన్నారు. సహకార వ్యవస్థ బలోపేతానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు చర్యలు తీసుకుంటున్నారన్నారు. జిల్లా సహకార అధికారి ఎస్.రామాంజనేయులు, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి వైఎస్ జగన్

- 'వై ఏపీ నీడ్స్ జగన్'లో కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు



గూళ్యం-01 సచివాలయం ఎదుట సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

కర్నూలు(రాజ్‌విహార్):పేదలకు మంచి చేసే నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నేతలు అన్నారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం మూడో రోజు మంగళవారం జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో జరిగింది. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సచివాలయాల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి వైఎస్ జగన్ సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి చేసిన మేలును ప్రజలకు వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాలకు ప్రభుత్వం రూ.2.50 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేసిందన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోలేదని, మళ్లీ ఇప్పుడు అధికారం కోసం ఆచరణ సాధ్యం కాని హామీలతో ముందుకు వస్తున్నారన్నారు. బాబు మాటలు నమ్మ వద్దని ప్రజలకు చెప్పారు. పేదల పక్షపాతి అయిన వైఎస్ జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హొలగుంద మండలం గూళ్యంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, కర్నూలులో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, కర్నూలు మండలం పసుపల, కోడుమూరు, గూడూరులలో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, మంత్రాలయంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ఎమ్మిగనూరు నియోజకవర్గం గోనెగండ్లలో పార్టీ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం చేపట్టారు.

పుణ్యస్నానాల సమయంలో జాగ్రత్త



ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నదీ తీర ప్రాంతాలు, కాలువల్లో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కృష్ణకాంత్ సూచించారు. పుణ్యస్నానాలకు మహిళలు ఒంటరిగా వెళ్లకూడదన్నారు. దీపాలు వెలిగించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కార్తీక మాస స్నానాలు, దీపాలు వదిలే ప్రాంతాలైన కర్నూలులోని వినాయక ఘాట్, కాల్వబుగ్గ రామేశ్వర శివాలయం, బ్రహ్మగుండేశ్వర శివాలయం, గురజాల గ్రామ శివాలయం తదితర నదీ తీర ప్రాంత శైవాలయాల దగ్గర భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశమున్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు.

ముఖ్యమైన ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు

కార్తీక మాసోత్సవాలు ముగిసేవరకు ముఖ్యమైన ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ప్రజలు పోలీసుల సూచనలు పాటిస్తూ నదీస్నానాలు ఆచరించి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.

క్వింటా మిర్చి రూ.27,525

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎండుమిర్చి ధర జోరుమీద ఉంది. 2023–24లో సాగు చేసిన మిర్చి పంటకు సంబంధించిన దిగుబడులు ఇప్పుడిప్పుడే మొదలయ్యాయి. మంగళవారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు 105 క్వింటాళ్లు అమ్మకానికి రాగా.. అత్యధికంగా రూ.27,525 ధర లభించడం విశేషం. కనిష్ఠ ధర రూ.5,099, మోడల్ ధర రూ.15,509 నమోదైంది. 2022–23లో జిల్లాలో 1.26 లక్షల ఎకరాల్లో మిర్చి సాగయింది. 2023–24లో 1.48 లక్షల ఎకరాల్లో మిర్చి సాగవడం విశేషం. డిసెంబర్ నెల నుంచి మిర్చి దిగుబడులు పెరిగే అవకాశం ఉంది.



ఎమ్మెల్యే కాటసాని సమక్షంలో వైఎస్ఆర్‌సీపీలో చేరిన పెసరవాయి గ్రామ టీడీపీ శ్రేణులు

టీడీపీకి భారీ షాక్

- పెసరవాయిలో 150 కుటుంబాలు వైఎస్ఆర్‌సీపీలో చేరిక
- పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల:మండలంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. తెలుగుదేశంలో ఎంత కష్టపడినా గుర్తింపు లేదని పెసరవాయి గ్రామానికి చెందిన సుమారు 150 కుటుంబాలు మంగళవారం ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమక్షంలో వైఎస్ఆర్‌సీపీలో చేరాయి. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి,శిరుప శ్రీనివాసరెడ్డి, రాజారెడ్డి ఆధ్వర్యంలో ఏసురత్నం, రాజేష్, లివికుమార్, రాజు, వెంకటరమణ,జగన్, తులసమ్మ, వెంకటలక్ష్మి, చల్లా వెంకటేశ్వర్లు, ఫాతిమా, ఆవుల నాగలక్ష్మమ్మ, వెంకటలక్ష్మమ్మలతో పాటు పలువురు టీడీపీ శ్రేణులు వైఎస్ఆర్‌సీపీ కండువా కప్పుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన, వెనుకబడిన వర్గాలకు కల్పిస్తున్న ప్రాధాన్యతకు ఆకర్షితులై పార్టీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. తమ పార్టీ బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. అంతకు ముందు పార్టీలో కొత్తగా చేరిన వారు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు శివరామిరెడ్డి, నాయకులు డాక్టర్ నిరంజన్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, నంద్యాల జిల్లా వ్యవసాయ సంఘం విభాగం అధ్యక్షుడు శిరుప శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్లకు స్థానాల కేటాయింపు

- కౌన్సెలింగ్ ద్వారా మండలాలకు నియామకం
- నేడు సాంకేతిక సహాయకులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు అమరనాథరెడ్డి, రామచంద్రారెడ్డి, సలీమ్‌బాషా

కర్నూలు(అగ్రికల్చర్): రేషనలైజేషన్‌లో భాగంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు కొద్ది నెలల క్రితం బదిలీ అయిన కంప్యూటర్ ఆపరేటర్లు, సాంకేతిక సహాయకుల్లో (టీఏ) పలువురిని గ్రామీణాభివృద్ధి శాఖ తిరిగి ఉమ్మడి కర్నూలు జిల్లాకు కేటాయించింది. ఉమ్మడి జిల్లాకు 92 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 140 మంది సాంకేతిక సహాయకులు రావడంతో వారికి కౌన్సెలింగ్ ద్వారా మండలాలు కేటాయించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా యూనిట్‌గా కర్నూలు జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం 92 మంది కంప్యూటర్ ఆపరేటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బుధవారం సాంకేతిక సహాయకులకు జిల్లా నీటియాజమాన్య సంస్థ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఇందులో కర్నూలు హెచ్‌ఆర్ మేనేజర్ విక్రమ్, నంద్యాల జిల్లా హెచ్‌ఆర్ మేనేజర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కుల గణనపై ఇంటింటి ప్రచారం

కర్నూలు(సెంట్రల్): కుల గణనకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో నేటి నుంచి ఈనెల 25వ తేదీ వరకు వలంటీర్లతో ఇంటింటా ప్రచారం నిర్వహించనుంది. కులగణనకు ఎన్యుమరేటర్లుగా సచివాలయ ఉద్యోగులను ఎంపిక చేశారు. వారికి గణనపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈనెల 15,16 తేదీల్లో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. తరువాత వారు ఫీల్డ్ లెవల్‌లో వివరాలు సేకరించే ఎన్యుమరేటర్లకు ఈనెల 22వ తేదీలోపు శిక్షణ ఇస్తారు. వారి శిక్షణ పూర్తి అయిన తరువాత 27వ తేదీ నుంచి వారం రోజులపాటు అన్ని కులాల జనాభా, వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులకు సంబంధించిన సర్వే చేపడతారు. ఈ సర్వేలో ఎవరైనా మిగిలిపోతే డిసెంబర్ 10లోపు వారి వివరాలను సేకరిస్తారు. ఇదిలా ఉంటే కులగణనకు సంబంధించి ఈనెల 17వ తేదీన కర్నూలులో ప్రాంతీయ సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు.



గాత్రంలో శిక్షణ..

రాగ పరిమళం.. నృత్య నీరాజనం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

50 ఏళ్లకు పైగా కళామతల్లి సేవ

- సంగీతంపై మక్కువ పెంచుతున్న కళాశాల
- ప్రత్యేక కార్యక్రమాల్లో విద్యార్థుల ప్రదర్శన
- అనువైన సమయాల్లో శిక్షణ
- మానసిక ప్రశాంతతో పాటు ఉద్యోగ అవకాశం
- గృహిణులతో పాటు ఉద్యోగుల ఆసక్తి



సంగీతం పేరు చెప్పగానే రాష్ట్ర ప్రజలకు ముందుగా గుర్తు కొచ్చే పేరు పద్మభూషణ్ డాక్టర్ శ్రీపాద పినాకపాణి. ఈయన స్వస్థలం శ్రీకాకుళం జిల్లా అయినప్పటికీ వైద్యులుగా కర్నూలు మెడికల్ కళాశాలలో పనిచేస్తూ ఇక్కడే పదవీ విరమణ పొందారు. ఆ తర్వాత తుదిశ్వాస విడిచే వరకు కర్నూలులోనే ఉండిపోయారు. రోగాలను, రాగాలను సరిచేసిన సవ్యసాచిగా పేరుగడించారు. శాస్త్రీయ సంగీతానికి ఊపిరి పోసిన ఆయన ఎంతో మందిని వైద్య నిష్ణాతులుగా, సంగీత శిఖామణులుగా తీర్చిదిద్దడం విశేషం.

వయస్సు అంకె మాత్రమే..

కళాశాలకు వచ్చే విద్యార్థులను చూస్తే వయస్సు ఒక అంకె మాత్రమే అనే విషయం ఇట్టే అర్థమవుతుంది. ఈ వయస్సులోనే చదువుకోవాలి, ఆ వయస్సులోనే ఏదైనా సాధ్యమనే భావనను చెరిపేస్తున్నరు ఇక్కడి విద్యార్థులు. 60 ఏళ్లకు పైబడిన వృద్ధులతో పాటు నాలుగైదేళ్ల చిన్నారులు సైతం ఇక్కడ శిక్షణ పొందుతుండటం విశేషం. కుల మతాలకు అతీ తంగా, వయస్సు భేదం లే కుండా ఇక్కడ పలుకుతున్న రాగాలు.. కదులుతున్న అందియ లను చూస్తే ఎంతో ముచ్చటేస్తుంది.





దాసరి పార్వతి. కృష్ణగిరి మండలం లక్కసాగరం గ్రామానికి చెందిన ఈ యువతి పాటతోనే ప్రపంచానికి పరిచయమైంది. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన ఈమె ఒకప్పుడు సంగీతం నేర్చుకోవడానికి మరో ప్రాంతానికి నడిచి వెళ్లాల్సిన పరిస్థితి. అలాంటిది ఈమె గొంతులో పలికిన పాట తన గ్రామం ఎప్పుడూ చూడని బస్సును పరిచయం చేయగలిగింది. ఈమె ఒక్కరే కాదు.. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ జిల్లాకు చెందిన ఎంతో మంది ఇటీవల కాలంలో టెలివిజన్ కార్యక్రమాలతో తమ ప్రతిభను చాటుతున్నారు.

రోజంతా ఉత్సాహం

నా భర్త ప్రయివేట్ ఉద్యోగం చేస్తున్నారు. పిల్లలు పాఠశాలకు వెళ్లే వరకు ఒకటే హడావుడి ఉంటుంది. ఆ తర్వాత ఇంటి పనులు ఉండనే ఉంటాయి. చిన్నప్పటి నుంచి పాటలు పాడటం అంటే ఎంతో ఇష్టం. పెళ్లయిన 14 ఏళ్లకు మా ఆయన ప్రోత్సాహంతో శారద కళాశాలలో చేరి గాత్రంలో రెండేళ్లుగా శిక్షణ పొందుతున్నా. మానసిక ప్రశాంతతో పాటు రోజంతా ఉత్సాహంగా ఉండగలుగుతున్నా.

– అంబిక, గృహిణి, కర్నూలు

మానసిక ప్రశాంతత లభిస్తుంది



వైద్య వృత్తి కావడంతో మానసికంగా ఎంతో ఒత్తిడి ఉంటుంది. చిన్నప్పటి నుంచి నృత్యం నేర్చుకోవాలనే ఆసక్తి ఉండటంతో ఎండీ పూర్తయ్యాక రెండేళ్ల పాటు శిక్షణ తీసుకున్నా. ఆ సమయంలోనే శ్రీశైలం, అహోబిళం, విజయవాడలో ప్రదర్శనలు కూడా ఇవ్వడం మర్చిపోలేని అనుభూతిని ఇచ్చింది. నృత్యం చేయడం ద్వారా మానసికంగా, శారీరకంగా కూడా దృఢంగా ఉండగలుగుతాం. నృత్యం, సంగీతం విలువ తెలుసు కాబట్టి మా పాపకు ఇప్పటి నుంచే శిక్షణ ఇప్పిస్తున్నా. నేను కూడా ఇప్పటికీ శిక్షణకు వెళ్తున్నా. యోగా, వాకింగ్, వ్యాయామం కూడా చేస్తున్నా నృత్యం చేయడం ద్వారా కలిగే సంతృప్తి మాటల్లో చెప్పలేం.

– చందన రాజారామ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, కర్నూలు మెడికల్ కళాశాల

సాక్షి, కర్నూలు డెస్క్

ఒకప్పుడు పెళ్లి చూపులు అనగానే సంగీతం వచ్చా అని అడిగేవారు. ఏదమ్మా ఓ పాట పాడమని అడిగి మరీ మైమరిచిపోయేవారు. ఆ తర్వాత.. సంగీతం ఏముందిలే, పిల్లలకు జోలపాట పాడితే చాలనుకున్నారు. ఇప్పుడిక అమ్మాయిలు దొరకడమే కష్టమవుతున్న పరిస్థితుల్లో సంగీతం మాటే మర్చి సర్దుకుపోతున్నారు. పిల్లలకు కనీస సంగీత జ్ఞానం నేర్పుదామని కొందరు తల్లిదండ్రులు భావిస్తున్నా.. ఆ దిశగా గొంతు విప్పేందుకు ఎవరూ ముందుకు రాని పరిస్థితి. కనీసం టీవీల్లో పాత పాటలు చూద్దామన్నా.. పిల్లలు రిమోట్ లాగేసుకొని మార్చేయడం ప్రతి ఇంట్లో కనిపించే తంతే. పండగలు పబ్బాల సమయంలో ఏ గుడిలోనో, లేక ప్రత్యేక కార్యక్రమాల్లోనో తప్ప కచేరీల ఊసే ఉండటం లేదు. ఇక కొన్ని వాయిద్యాల పేర్లు కూడా ఇప్పటి తరం తెలుసుకోలేకపోవడం చూస్తే సంగీతం ఏస్థాయిలో కనుమరుగవుతుందో అర్థమవుతోంది. ఇలాంటి రోజుల్లో కూడా కర్నూలు నగరంలోని



కర్నూలులోని ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాల

ప్రభుత్వ శారద సంగీత, నృత్య కళాశాల సంగీత పరిమళాలను వెదజల్లుతోంది. ఆ భవనం నుంచి ప్రతి రోజూ వినిపించే రాగాలను వింటే ఎప్పుడో ఒకప్పుడు తిరిగి పూర్వ వైభవం వస్తుందనే ఆశ కలుగుతుంది.

అందరికీ అనువైన సమయంలో..

ఇప్పుడున్న పరిస్థితుల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను ర్యాంకుల వెంట పరుగులు తీయిస్తున్నారు. ఆ దిశగానే పిల్లల బుర్రలను పదును పెడుతున్నారు. పాఠశాలకు వెళ్లామా.. ఇంటికి వచ్చామా.. ఇలానే సాగుతోంది జీవనం. చాలా అరుదుగా పిల్లలను సంగీతంలోనూ తీర్చిదిద్దాలనే ఆలోచనకు వేదికగా నిలిచిన శారద సంగీత కళాశాల అనువైన సమయాల్లోనే శిక్షణ ఇస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో కర్నూలు పాత బస్టాండ్ ప్రాంతంలోని ఓ భవనం ఎన్నో రాగాలను పలుకుతోంది. పాటలు పాడించడమే కాదు వివిధ రకాల వాయిద్యాలను పలికించడంలోనూ నిష్ణాతులను చేస్తోంది. అనుభవజ్ఞులైన అధ్యాపకులు కూడా తోడు కావడంతో విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

జీవితంలో స్థిరపడే దిశగా..

సంగీతం నేర్చుకుంటే ఏమొస్తుంది, మహా అయితే ఇంట్లో కూనిరాగాలు తీయడం మినహా అనే భావనను ఈ కళాశాల తొలగిస్తోంది. తీరిక సమయాల్లో తీసుకునే శిక్షణ జీవితంలో స్థిరపడేందుకు బాటలు కూడా వేస్తోంది. ఇక్కడ సర్టిఫికెట్ కోర్సులతో పాటు డిగ్రీలు కూడా చేసే అవకాశం ఉండటంతో పాఠశాలల్లో ఆయా విభాగాల ఉపాధ్యాయులుగా కూడా రాణిస్తున్నారు. శారద కళాశాల నుంచి ఇప్పటి వరకు 50 మంది ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

ఎన్నో వ్యాధులను నయం చేసే శక్తి

పాటకు రాళ్లను కరిగించే శక్తి కూడా ఉందంటారు. అంతేకాదు.. ఇటీవల కాలంలో పెద్ద పెద్ద ఆపరేషన్లు కూడా ఎలాంటి మత్తు ఇంజెక్షన్ ఇవ్వకుండా కేవలం మ్యూజిక్ వింటూనే చేయించుకున్న ఉదాహరణలు కూడా ఉన్నాయి. ఎలాంటి వ్యాధినైనా సంగీతం నయం చేస్తుందనే విషయం ఎన్నో పరిశోధనలు రుజువు చేశాయి. అమెరికాలో నిర్వహించిన ఓ పరిశోధన ఇదే విషయాన్ని వెల్లడి చేస్తోంది. రెండు రూములను ఎంచుకొని, ఒకే విధమైన విత్తనాలను వాటిలో పెంచడం మొదలుపెట్టారు. వీటిలో ఒక రూములో శాస్త్రీయ సంగీతం అదనంగా ఏర్పాటు చేశారు. అనూహ్యంగా ఈ మొక్కల ఎదుగుదల ఆరోగ్యకరంగా ఉన్నట్లు పరిశోధన ఫలితం వెల్లడైంది.

ప్రభుత్వ శారదా సంగీత నృత్య కళాశాలలో అందుబాటులోని కోర్సులు

- గాత్రం
- కూచిపూడి
- డోలు
- మృదంగం
- వీణ
- నాదస్వరం

గత ఐదేళ్లలో విద్యార్థుల సంఖ్య

2018-19	230
2019-20	225
2020-21	232
2021-22	284
2022-23	325
2023-24	253

పారిశ్రామికవాడల్లో సంరక్షణ గదులు

- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు విరివిగా రుణాలివ్వాలి
- జిల్లాస్థాయి ఎగుమతుల పదోన్నతుల కమిటీ సమావేశంలో కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): హైకోర్టు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పారిశ్రామిక వాడల్లో మహిళలు, చిన్నారుల సంరక్షణ కోసం ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి ఎగుమతుల పదోన్నతుల కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ..నూతన పరిశ్రమల ఏర్పాటు, రెన్యువల్ కోసం వచ్చిన అర్జీలను సింగిల్ విండోల నిబంధనల మేరకు 21 రోజుల్లో (రెడ్ పరిశ్రమలు తప్ప)ఆమోదం తెలపాలన్నారు. పీఎంఈజీపీ కింద ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు విరివిగా రుణాలు ఇవ్వాలని ఆమె బ్యాంకర్లను ఆదేశించారు. ఓర్వకల్ ఇండస్ట్రియల్ హబ్‌లో జయరాజ్ ఇస్పాత్ కంపెనీ పనులపై కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం 18 క్లెయిమ్‌లకు సంబంధించి రూ.174 కోట్ల ప్రోత్సాహకాలకు సమావేశం ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో పరిశ్రల శాఖ జీఎం ప్రసాదు, ఆర్‌డీఓ హరిప్రసాదు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ రెడ్డి, డీటీసీ శ్రీధర్, డీపీఓ నాగరాజునాయుడు, ఏపీ ఎంఐపీ పీడీ ఉమాదేవి, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, చేనేత సహాయ సంచాలకులు హరిప్రసాదు, కాలుష్య నియంత్రణ అధికారి మునిప్రసాదు, చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా చైర్మన్ విజయకుమార్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజమహేంద్రనాథ్ పాల్గొన్నారు.

రబీ సీజన్‌కు 2,150 క్వింటాళ్ల వేరుశనగ

- పత్తికొండ సబ్ డివిజన్‌కు అత్యధికంగా 1,280 క్వింటాళ్లు

కర్నూలు(అగ్రికల్చర్): రబీలో నీటి ఆదారంపై సాగుకు సబ్సిడీ వేరుశనగ విత్తనం కాయల పంపిణీకి రంగం సిద్ధమైంది. ప్రభుత్వం జిల్లాకు 2,150 క్వింటాళ్ల వేరుశనగను కేటాయించింది. నీటి వసతిని బట్టి మండలాల వారీగా వేరుశనగను కేటాయిస్తూ జిల్లా వ్యవసాయ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. అత్యధికంగా పత్తికొండ సబ్ డివిజన్‌కు 1,280 క్వింటాళ్లు కేటాయించారు. ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ(ఏపీ సీడ్స్) వేరుశనగ విత్తన కాయలను ఆర్‌బీకేల వారీగా పొజిషన్ చేస్తుంది.

డోన్ డివిజన్ ఏసీఎఫ్‌గా సూర్యచంద్ర రాజు




కర్నూలు కల్చరల్: అటవీ శాఖ డోన్ డివిజన్ అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (ఏసీఎఫ్)గా ఎం. సూర్యచంద్ర రాజు నియమితులయ్యారు. ఈ మేరకు అటవీశాఖ ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ మధుసూదనరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు రేంజ్ ఎఫ్ఆర్వోగా విధులు నిర్వహిస్తున్న ఈయనకు ఏసీఎఫ్‌గా పదోన్నతి కల్పించి నంద్యాల సర్కిల్ పరిధిలోని డోన్ డివిజన్‌కు బదిలీ చేశారు. పదోన్నతి పొందిన సూర్యచంద్రరాజును కర్నూలు రేంజ్ కార్యాలయ ఉద్యోగులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

త్వరలో కరువు ప్రాంతాలకు సెంట్రల్ టీమ్

కర్నూలు(అగ్రికల్చర్): కరువు ప్రాంతాలుగా గుర్తించిన మండలాల్లో త్వరలో సెంట్రల్ టీమ్ పర్యటించనున్నట్లు వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ తెలిపారు. సెంట్రల్ టీం రానున్న నేపథ్యంలో వ్యవసాయ యంత్రాంగం కరువుపై పూర్తి స్థాయి నివేదికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. మంగళవారం గుంటూరు నుంచి వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కరువు, ఇతర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... మరిన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించాలనే ప్రతిపాదనలు వస్తున్నాయని చెప్పారు. రబీలో శనగ సాగుకు అదును దాటిపోయినందున సబ్సిడీపై శనగ విత్తనాల పంపిణీని వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు. నీటిపారుదల కింద వేరుశనగ సాగు చేసే రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయాలని తెలిపారు. కర్నూలు నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏడీఏలు సాలురెడ్డి, మహమ్మద్ ఖాద్రీ, సునీత తదితరులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో ఉపాధి పనులు

- ఎన్ఆర్ఈజీఎస్ జాయింట్ కమిషనర్ ఎం.శివప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ ఎం.శివప్రసాద్

ఎమ్మిగనూరు రూరల్: పక్కా ప్రణాళికతో కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని జాతీయ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్)జాయింట్ కమిషనర్ ఎం.శివప్రసాద్ అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో జిల్లా స్థాయి ఏపీడీలు, ఏపీఓలు, ఈసీలు, ప్లాంటేషన్ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 25 మండలాల్లో ఆదోని డివిజన్ చాల వెనకబడి ఉందని చెప్పారు. ఈ ప్రాంతం నుంచి వలసలు వెళ్లకుండా పనులు కల్పించాలన్నారు. అయితే, చాలా చోట్ల చేసిన పనులే చేయిస్తున్నారని ఉపాధి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మట్టిని తవ్వే పనుల స్థానంలో కొత్త పనులు చేపట్టాలని ఆదేశించారు. ఫామ్‌పాండ్స్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో కర్నూల్, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని, ఆలూరు క్లస్టర్ల ఏపీడీలు లక్ష్మన్న, అల్లిపీరా, పద్మావతి, లోకేశ్వర, పక్కిరప్ప తదితరులు పాల్గొన్నారు.